# లేఖ

My dear Souris,

వొచ్చాను. మొదటిరోజు సంగతులే కథలాగూ, కలలాగూ, ఉన్నాయి. బెజవాడ రైల్లో Inter ని చెన్నపట్నంలో వూడ్చిన చెత్తతో నింపి పంపారు. కాని బాగానే ఉంది. Harmless చెత్త. తాడేపల్లి గూడెంలో బస్సులు కాలం వొదిలేశాయి. Beyond limits of time. వాటికి కాలమూ, స్ప్రింగులూ, లేవు. అప్పుడప్పుడు దోవలో "ఇప్పుడు రెండు గంటలా, అయిదుగంటలా?" అని indifferent గా అడుగుతో వుంటారు. కొన్నాళ్ళుపోతే "ఇప్పుడు మూడో తారీకా, ఆరో తారీకా ?" అని అడిగేటట్టున్నారు. రెండో తారీకున బయలుదేరి, చివరకి 5 1/2 కి చేరాము, ఎన్నో కాలువలు దాటి. ఇన్ని నీళ్ళు Bengal లో తప్ప యెక్కడా వుండవేమో? ఇంత ఎండాకాలంలో పెద్దకాలువలు నిండుగా పోతోంటే, దేవుడిలో విశ్వాసం, తిరుగబెడుతుంది. నేను dream చేసినట్టే బంగళా పెద్దకాలవ పక్కనవుంది. కాని వీపు కాలవకి తిప్పింది—యీ మధ్యే తిప్పివుండాలి, యీ బస్సులు దుమ్ముచిమ్మడం ప్రారంభించిం తరవాత. దగ్గిరే లాకులు, తోటలు.

ఈ వూళ్ళో యేమీ దొరకవు, ఇవి తప్ప—

కొబ్బరికాయలు

చెరుకులు

కమలాలు

మల్లెపువ్వులు.

ఇంకేంకావాలి ? ఈగలూ, సాలీళ్ళూ, బొద్దింకలూ, లేవు. ఎందు కంటే దోమలు మనుష్యులు చాలక వాటినికూడా తిన్నట్లున్నాయి. దోమలు వున్నా ఈ Commercial medical travellers పంతులుబోటివాళ్ళు, వాటి ముక్కుల్ని కోసి injection సూదుల samples కింద పంపారు, అందుకని గావును కుట్టవు.

బంగళావాడు ఒక thug. నిన్నటినుంచి నేను తిని పోసిన బంగారు తీగె చెరుకుచెత్త ('చే'తో చెప్పు. S S.L.C. పరీక్షమాని వొచ్చేనే ధైర్యం వొస్తుందేమో.) చూసి, నన్ను బంగళాలోంచి వెళ్ళగొట్టటానికి అది తగిన కారణమా లేదా, అని యోచిస్తున్నాడు. బంగళా thug నా తక్కిన పనుల్నిబట్టి నేను lunatic నని యీ మధ్యాహ్నంనుంచి జాలిపడు తున్నాడు. అతనికి సాయింత్రం omletts కి డబ్బులు ఇచ్చి అతను తెచ్చి లెఖ్ఖచెపుతో వుండగా, పెనుగొండ బస్సు గుమ్మంలోకి వొస్తే డబ్బులు తీసుకోక, ఏమీ చెప్పక గది అట్లానే వొదిలి అతనుచూస్తో వుండగా మాయమైనాను. ఆ పెనుగొండలో సబ్ రిజిస్ట్రారు ఆఫీసుకి కూడా చిన్న డింగీలో కాలవ దాటాలి. అట్లా కాలవ ఎప్పుడూ దాటుతోనే వుండక, ఎందుకు పనులుచేస్తారో ఆ ఆఫీసులో. మళ్ళా ఇంటికి నడిచి వొచ్చాను దూరమూ, కాలమూ, మరిచి. చంద్రుడు చెట్లమీదనించి కాలవలోకి తొంగి చూస్తున్నాడు.వొచ్చి బంగళావాణ్ణి apologies కోరి, భోజనం తెమ్మని వూళ్ళోకి పంపాను. మళ్ళీ చెరుకులు అందుకున్నాను. హఠాత్తుగా ఒ—ట బస్సు తీసుకొచ్చి (యీ వూళ్ళో బళ్ళూ, సైకిళ్ళూ, కార్లులేవు. ప్రతి పనికీ బస్సే ! చిన్నపిల్లలు tricycles బదులు perambulators బదులు బస్సుల్లోనే వెడతారు. పెళ్ళికొడుకులు వూరేగడానికి, పీనిగలు స్మశానాలకి పోవడానికి బస్సులే !) పాలకొల్లు పోదాం రమ్మని తీసుకుపోయినాడు.

బస్సులోకి. చెరుకు కర్ర వొదిలి, వెళ్ళాను. బంగళావాడు, వెన్నెట్లో యెదురుపడి టిఫిన్ కారియర్‌తో డాన్సు చేస్తున్నాడు, బస్సువెనుక.

మళ్ళీ తెల్లవారుఝామున, వెన్నెట్లో ఎక్కడికో! సరిగా సినిమాకి వెళ్ళాం. లోపల గగ్గయ్య (మైరావణలో) అరుస్తున్నాడు. గగ్గయ్యేనా! ఎవడో భోజనం తెప్పించారు. హోలుబైట నాకు 9 1/2కి తిండి. లోపల చాలా గొప్పసీను జరుగుతోందంటే వెళ్ళాము. చంద్రసేన పడకటిల్లు. ఓ మంచం శ్రీరాముడు కూచుంటే విరిగింది. ఆ కీచుగొంతుకతో అరిచే ఆ కాంచనమాలని ఎట్లా భరిస్తారో! ఆ చంద్రసేనని చూసి ఆ జానకడుపు ఆర్పివాడు శ్రీరాముడు కూడా నిరాకరించేడంటే, ఆశ్చర్యమేముంది! ఆ చంద్రసేన యేడుపు, హాహా అని యేదో realize చేసిన పాడుమొహం— భరించడం కష్టం. ఆ శ్రీరాముడు మనింట్లో నౌకరుగా వొస్తానంటే "నువ్వు మా మందాల్లో నల్లుల్ని హత్యచేసి తినేట్టున్నావు. వొద్దు పోమ్మం" టాము.

తరువాత పెళ్ళిలో భోగంమేళం చూడ్డానికి వెళ్ళాము. నన్ను గొప్పచేసి నా మొహంమీద వాళ్ళనాట్యం పట్టించారు. వాళ్ళల్లో ఒకత్తె చాలా చక్కని అమ్మాయివుంది. చక్కదనమే కాదు—కళ్ళల్లో చాలా కళలు చూపుతుంది. ఆమె నా కళ్ళల్లో వేళ్ళు పెట్టి,అల్లరిచేసింది. కాని art కాని music గానిలేవు. తక్కినవాళ్ళలో అందమూలేదు. కొంత సేపటికి నాకు విసుగుపుట్టి పోదామన్నాను. "వీల్లేదు-ఒక అమ్మాయిని కోరుకో, వీళ్ళతో nightspend చేద్దామన్నాడు నామిత్రుడు. ఆ అమ్మా యిమీద too much respect నాకు. తక్కిన వాళ్ళ మీద too much contempt. కనక నాకక్కర్లేదు. "ఇంటికిపోతా" నని మారాం పట్టాను. 'ఎందుకు' అంటే 'నిద్ర' అని వొంక పెట్టాను. కాని ఇంటి బెంగ పట్టు కుంది. ఎక్కడో పక్క ఏర్పాటు చేస్తామన్నారు. miserableగా home

sick గా feel అయినాను. Home ఏమిటి అని నవ్వుకుంటాను. కాని పోవాలి. ఎక్కడికో పోవాలి. కాఫీ హోటలుకి. రాత్రి పదకొండింటికి. ఆ బల్లమీద తలపెట్టి నిద్రపోయినాను, వాళ్ళుతింటోవుంటే మూసేశారు హోటలు. బయటికి వొచ్చాను, వొంటరిగా! బస్సుడ్రైవరు వచ్చాడు; ఒక request తో. 'ఇన్‌స్పెక్టరుగారు రెండింటికే బయలు దేరతా మంటున్నారు. తమరెట్లానన్నా నాలుగు గంటలు చెయ్యండి—మాకు కొన్ని టిక్కెట్లు దొరుకుతాయి" అని. నన్ను !!! చస్తోవుంటే. కాకినాడ తురక సన్నాయివాళ్ళు జ్ఞాపకం వొచ్చారు. ఇంతేనా యీ రాత్రికి ! ఏదన్నా miracle జరక్కూడదూ ! భగవాన్ కారులోవచ్చి ఆ యెనిమిది మైళ్ళూ నన్ను తీసుకుపోకూడదూ ! మిత్రుల్ని కలుసు కున్నాను. పోతాన్నాను. వినరు. నవ్వుతారు. "నీకు తమాషాలు చూపుతామం"టారు. ఆ ఫలహారాలు, ఆ కోమటి కుర్రాళ్ళు, ఆ భోగంవాళ్ళు—ఇవీ తమాషాలు. అవి Enjoy చెయ్యలేనే అని నా దిగులు. సంతోషంగా నవ్వేవాళ్ళని చూసి నాకు Envy. ఒక gunset మేళం దగ్గరికి వెళ్ళాం. చాలా బాగా వాయించాడు. అతనివేళ్ళు గుండెలమీద ఆడాయి. కానినేను నా misseryని వొదల తలుచుకోలేదు. రోడ్డు మధ్య పక్కవేసి నిద్రపోమన్నారు. ఆ మేళాలమధ్య! మిమ్మల్ని తలుచుకున్నాను. హాయిగా నిద్రపోతో వుంటారు.

ఎందుకు వొచ్చానిక్కడికి? ఒచ్చితిబో ! వీళ్ళతో ఎందుకు బయలు దేరాను? ఎవరూ పిలవని నన్ను, ఒకాయన బస్సు తీసుకొచ్చి రమ్మన్నాడనే బడాయివల్లా ! భగవాన్ మీద కోపమొచ్చింది. ఎందుకు ఇట్లాంటి గోలల్లోకి నెడతాడు నన్ను! ఒక సైకిలన్నా జట్కాఅన్నా ఇయ్యండి పోతానన్నాను. "పడుకో! మూడింటికే వెడదాంలే" అన్నారు. అంతలో గోల! గుంపు ! మా బస్సు డ్రైవర్ని కొట్టి పోలీసులు లాక్కెడుతున్నారు, భోగంవాళ్ళని అల్లరి చేశాడని. లాకప్పులో పెట్టారు. ఇంక నా గతేమిటి ! ఆ గోలలో తప్పించుకున్నాను. వొంటరిగా పోతున్నాను—ఎనిమిది

మైళ్ళు నడవాలనే ! ఎట్లానూ తెల్లవారుతుంది. కాని కూచోలేను. పడుకోలేను. మళ్ళీ నా నిద్ర కళ్ళముందు సినిమాహాలు ! రేపు 'బాభీ' అని advertisement. ఇందాకటి సినిమా అతను, నాకు భోజనం పెట్టిన ఆయన, మైరావణమెచ్చుకునే ఆయన! బాభీ చాలాగొప్ప Picture, బారువా డైరెక్షన్ అని పొంగి పోతున్నాడు, ఎవరితోనో! వింత ఆంధ్ర దేశం! మైరావణుని, బాభీని కలిపి మెచ్చుకునే మనుషులు ! ఆ సినిమా ఆయన్ని బతిమాలితే, సైకిలిమ్మని! childని నేను ! పక్కేసి, పడుకోమంటాడు. ఆ సినిమాలో, గగ్గయ్యఅరుపుల్లో నిద్రా! గగ్గయ్యేనా ! నా బాధయేమిటో ఎట్లా చెప్పను అతనితో ? టిటిల్ కురుపుకన్నా ఎక్కువ బాధ అని! నాకే తెలిదే! ఈ childish helplessness చూస్తేనాకు చాలా కోపం నామీద! కాని చాలా ప్రేమకూడా నన్ను అమితమైన తిప్పలు పెట్టింది జీవితంలో. కాని అదే నాలో lifeని freshగా ఉంచుతోంది అనుకుంటా.

నడిచాను. ఊరిబైట కాలవవొడ్డున విప్పేసిన జట్కా. దీక్షితులుగారు భగవాన్ అనుగ్రహం అంటారు. పన్నెండణాలకి తీసుకుపోతాడట. ఇస్తాను. దిగులేసింది. అలిసిన గుర్రాన్ని మళ్ళీ ఎనిమిది మైళ్ళు పరిగెత్తించాలి. కాని self, self నా బాధ ! బండివాడి దగ్గర అయిదు రూపాయిలకి చిల్లరలేదు. మళ్ళా దుకాణాల దగ్గరికి. ఆ రాత్రి ఎవరిస్తారు ! Gold flake అనేటప్పటికి అరగంటలో చిల్లర వూడిపడ్డది. నా మిత్రులు తరుముకు వొస్తున్నారని భయం, జట్కాలో కూచుని పరుగు fugitive లాగు. ఆ గుర్రం భగవాన్ అనిపించింది. ఎందుకు పరుగు! ఏమిటి భయం ! ఎవరికి తెలుసు? లోకంలో భయాలన్నీ ఏమిటి ? నా వెర్రిభయం నాది ! మళ్ళీ వెన్నెల్లో కాలవ పక్కన చెట్లనీడలో—నిద్రలో తేలిపోయే పడవల్ని చూస్తో—అమ్మవీ, నావీ పేర్లు 20 ఏళ్ళకిందట చెక్కిన జ్ఞాప

కాలలో పలవరించే చెట్లకిందనించి ఈ నా వూరు. బంగళా. ఏమైనావని ప్రశ్నలు, గొణిగే వాచరు—Sleeping dose- నిద్ర-తెల్లారి తల నెప్పి—మళ్ళీ- duty- పరీక్ష పేపర్లు చెక్కింగ్ !

ఎంత కథ !

ఇంక యీ బంగళానుంచి కదల దలచుకోలేదు. యివ్వాలిటికి !

బ-ఇంటో భోజనం యివాళ, వాళ్ళింటో gramaphone అన్నీ సైగల్ రికార్డులు. కాని ఆ sound-box వేలుతో తోస్తో వుంటేనే గాని, గీతని వొదిలి గీతకి నడవదు. ఒక silent relative అట్టా నెట్టుకుంటూ వుండాడు, అన్నిగంటలూ ! రామశాస్త్రిగారు ఏమంటారో !

దీక్షితులుగారు వొచ్చారేమో, బెజవాడ !

ఎవరన్నా మిత్రులొస్తే, యీ నా చరిత్ర చెప్పు వాళ్ళకి.

సాయంత్ర మవుతోంది. చదివి చదివి బైటికి పోవాలనిపిస్తోంది. పాలకొల్లు వేపైనాసరే ! భగవాన్ కూడా నా బుద్ధిని మార్చలేడనుకుంటా.. లాకుల దగ్గిర కూచుందామంటే వాన కురిసిన నేల. బురద. 'చే' కోప్పడుతుందని భయం.

మళ్ళీ Russel's Relativity చదువుతున్నాను. సైన్సు చదివిన కొద్దీ భగవాన్ చెప్పే దాంటో విశ్వాసం ఎక్కువవుతోంది. కొన్ని భగవాన్ వాక్యాలు యీ సైన్సు పుస్తకాల్లో కనబడతాయి.

ఆ బోగం వాళ్ళ నాట్యాన్ని చూస్తే రోహిణి యేమనేదో కాని ఆ అమ్మాయిలో యేదో గొప్పతనం వుంది. కాని ఆ రాత్రి నా ప్రక్కన కూర్చున్న నల్లటివాడు ఒకడు పదిహేను రూపాయిలకి కొన్నాట్ట, ఆమెని ముందు రాత్రి ఆ కలలుకనే కళ్ళని-కాని పెళ్ళి చేసుకుంటే మాత్రం—ప్రేమిస్తే మాత్రం-అంతా కొనడమే, నా కలల్ని, నా స్వేచ్ఛని, నా శక్తిని-రోజుకి అయిదు రూపాయిలకి కొన్నారు ఆమేనయం. ఒక రాత్రికి

పదిహేను రూపాయలు ! మంచి reasoning గే గాని, ఒప్పుకోదు హృదయం– ఆ కళ్ళలో అందాన్ని, ఆ నల్లపాపల్లోని వెర్రిఆశల్ని నా వేపు చూడ్డంలో ఆ అల్లరిని, దీనత్వాన్ని, ఏదో నాకు తెలీదుకాని, దేని మీదనో తిరగబడుతుంది మనసు. నా friend's offer ని accept చేసి, ఆ అమ్మాయితో మాట్లాడి వుంటే! ఆమె soul కి appeal చేసివుంటే! కాని ఆమె కాంచనమాలమల్లే మాట్లాడితే! ఈ కలలన్నీ యేమవుతాయి! కాని ఆమె ఆ కళ్ళల్లో కాంతి reality యేనా ! నేను కల్పించుకున్నానా ? space and time reality కావంటున్నాడు, Russel !

ఏదో ఇదంతా ఉత్తరంకాకుండా musings అయిపోయినట్టుంది, చివరికి !

ఎండ వొచ్చింది. లోక మెట్లావుందో పరీక్షిస్తాను.

నువ్వు వొస్తే ఎట్లా వుండేవాణ్ణి-ఏం చేస్తో వుండేవాణ్ణి అనుకుంటూ వుంటాను. "వొయ్యి"కి చెప్పు, ఇదంతా. అమ్మ కురుపు నయం అయిం దని నాకు తెలుసు పిన్ని వొస్తే నువ్వు రా. తాడేపల్లిగూడెంలో దిగగానే దగ్గిరే బస్సు directగా.

అప్పుడే నన్ను బంగళాలో కుక్క వొకటి పెంచుకుంది.

సైకిలు అద్దెకు తీసుకుని "ఛాభీ"కి పోవాలని నిశ్చయం చేసుకున్నాను.

రానుపోను పదహారు మైళ్ళు తొక్కాలి. కానీ.

నూరుమైళ్ళు వచ్చానో, లేదో ! ఆఫ్రికా మధ్యనుంచి రాస్తున్నట్టు రాశానని నా కే నవ్వుగా వుంది. కాని illusion పోతుందని నా భయం! చిన్నప్పటి illusions పోయేగా జీవితం నిస్సారం అయిపోవడం! వెన్నెల కోసం wait చేస్తున్నాను. ఒక కాలవ వుంది. mysterious గా చెట్లలోకి పోతోంది. దాన్ని explore చెయ్యబోతున్నాను యీ సాయంత్రం. వన్యమృగాలు, భిల్లుల ఆర్తనాదం యివి కూడా imagine చేసుకో గలిగితే ! Princess in danger-పోనీ నిన్నటి బోగంఅమ్మాయి in danger లో వుంటే! వుంది అనుకోగలిగితే !

Illusions పోవలసిందే? కాని పోతే పూర్తిగా పోయి truth and light break కావాలి. అందమైన illusions పోతాయి. ఉద్యోగం, అధికారం, డబ్బువిలువ, మర్యాద, comfort, దేహం, భయాలు-దిగుళ్లు—యీ iilussions మిగులుతాయి తల నెప్పులు కూడా.

నిన్నరాత్రి వెన్నెట్లో బస్సుమిత్రుడు, "France" యుద్ధం మానింది. ఇప్పు డేమవుతుందంటావు!" అంటున్నాడు. నేను news paper చదవనని చెప్పడానికి ధైర్యం లేకపోయింది—అతను నన్నేదో గొప్ప చేశాడని. Frnce సంగతి ఏమంటోంది అమ్మ! అప్పుడే బ— పశ్చాత్తాప పడుతున్నాడు, నాకు తిండి పెడతా నన్నానని.

నాన్న.

★